క్లుప్తంగా

14 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

కోడుమూరు రూరల్ : శ్రీచౌడేశ్వరీ దేవి తిరునాల సందర్భంగా ఈనెల 14వ తేదీ నుంచి కోడుమూరులోని ఎస్ఆర్‌టీ మైదానంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు దస్తగిరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేత జట్లకు మొదటి బహుమతిగా రూ.50వేలు, రెండవ బహుమతిగా రూ.25వేలు అందజేయడం జరుగుతుందన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



సి.బెళగల్లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ అనుపమ

సి.బెళగల్: మండలం కేంద్రం సి.బెళగల్‌లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం తహసీల్దార్ అనుపమ పరిశీలించారు బీఎల్వోలతో కలిసి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోట, రెగ్యులర్, స్పెషల్ పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. వసతులు, సౌకర్యాలు, సమస్యలను బీఎల్వోలు, పాఠశాల ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కిషోర్ కుమార్, వీఆర్వో శేఖర్, ఎంసీఓ మణి తదితరులు పాల్గొన్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గలో వెలసిన శ్రీబుగ్గరామేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 8 నెలలకు సంబంధించి స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకలను దేవదాయ శాఖ సమక్షంలో ఉదయం 10.30 గంటలకు లెక్కిస్తామన్నారు.

కాలువ నిర్మాణానికి భూమి పూజ



నూలుమిల్లు కాలనీలో భూమి పూజ చేస్తున్న సర్పంచ్ పల్లవి

పాణ్యం: మండల కేంద్రంలోని నూలుమిల్లు కాలనీలో డ్రైనేజీ కాలువల నిర్మాణానికి పాణ్యం సర్పంచ్ మేకల పల్లవి బుధవారం భూమి పూజ చేశారు. కాలనీలో డ్రైనేజీ కాలువలు లేక స్థానికులు ఇబ్బందులు పడేవారన్నారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చొరవతో కాలువల నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాలం చేంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు, కోఆప్షన్ సభ్యులు జాకీర్ ఉసేన్, బాబు, గురురాజారావు, సుబ్బయ్య, చికెన్‌వలి, గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు ప్రజల తాగు నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు బుధవారం 159 క్యూసెక్కులు విడుదల చేసినట్లు డ్యామ్ అధికారులు తెలిపారు. డ్యామ్‌లో 0.358 టీఎంసీల నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

సమన్వయంతో మెలగాలి



సి.బెళగల్ ఎంపీడీఓకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

సి.బెళగల్: గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల సమన్వయంతో మెలగాలని, పేదలకు అండగా నిలువాలని ఎంపీడీఓ శకుంతల సూచించారు. బుధవారం ఎంపీడీఓ తన కార్యాలయంలో ఈఓఆర్డీ సందీప్, కార్యాలయ సూపర్‌డెంట్ శ్రీనివాసులతో కలిసి మండలంలోని అన్ని గ్రామాల పీఎస్‌లతో సమీక్ష సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన ఎంపీడీఓ శకుంతలకు మండల అధికారులు, పీఎస్‌లు పూలమాలలతో శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వంద శాతం పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా కుల గణన కార్యక్రమం వెనుకబడి ఉందని, వేగం పెంచాలని సూచించారు.

ఇంటింటికీ వెళ్లి రేషన్ అందించాల్సిందే

కర్నూలు(సెంట్రల్): నగరంలోని అన్ని క్లస్టర్లలో ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ వెళ్లి రేషన్ సరుకులు అందజేయాలని జేసీ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం గణేష్‌నగర్, హౌసింగ్‌బోర్డు కాలనీల్లో రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎండీయూ వాహనాల ద్వారా అందజేస్తున్న సరుకులను కచ్చితంగా ఇళ్లు లేదా ఇళ్ల సమీపంలోకి వెళ్లి అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆపరేటర్లు, వలంటీర్లను ఆదేశించారు. ఆమె వెంట డీఎస్ఓ కేవీఎస్ఎం ప్రసాదు, అర్బన్ ఏఎస్ఓ ఉన్నారు.

నిబంధనలకు నీళ్లు

- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న పెట్రోల్ బంకులు
- వాహనదారులకు కనీస వసతులు కల్పించని యాజమాన్యాలు
- తాగునీరు, మరుగుదొడ్లు లేని వైనం
- ఫస్ట్ ఎయిడ్ బాక్సుల్లో అరకొర మందులు
- బంకుల నిర్వహణపై లోపించిన అధికారుల పర్యవేక్షణ

కొన్నేళ్లుగా రోడ్లపై వాహనాల సంఖ్యలో విపరీతంగా పెరుగుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని జాతీయ రహదారుల వెంట పెట్రోల్ బంకులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అయితే బంకుల నిర్వహణలో యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. వాహనదారులకు తాగునీరు, మరుగుదొడ్లు, గాలిపంపు, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు వంటి కనీస వసతులు కూడా కల్పించడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నాయి. ఫలితంగా వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఓర్వకల్లు: పెట్రోల్ బంకుల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో వాహనదారులు తీవ్ర అగచాట్లు పడాల్సివస్తోంది. ఓర్వకల్లు మండల పరిధిలోని నన్నూరు టోల్ ప్లాజా మొదలుకుని సోమయాజులపల్లె వరకు కర్నూలు–కడప జాతీయ రహదారిపై 9 పెట్రోలు బంకులు ఉన్నాయి. అందులో రెండు ప్రైవేట్‌కు చెందినవి కాగా, మిగిలినవి భారత చమురు కంపెనీల ఆధీనంలో పనిచేస్తున్నాయి. అయితే ఇక్కడ మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు, వైద్య పరికరాలు, తాగునీరు, గాలిపంపు, ఫిర్యాదుల పెట్టె, స్టాక్ వివరాలు, పనివేళల బోర్డులు, పరీక్ష యంత్రాలు, యాజమాన్యంతో పాటు సదరు కంపెనీల డీలర్ల ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచాలి. అయితే ఇవేవి పూర్తిస్థాయిలో అమలు చేసిన దాఖలాలు కనిపించడం లేదు.

నామమాత్రంగా గాలి పంపులు

మండలంలోని నన్నూరు రాగమయూరీ వద్ద ఉన్న ఎస్సార్ పెట్రోల్ బంకు, నన్నూరు బైపాస్ రోడ్డులోని భారత్ పెట్రోల్ బంకు, ఇందిరా ప్రయదర్శిని వద్దనున్న భారత్ పెట్రోల్ బంకు, లొద్దిపల్లె రోడ్డు, బిర్లా స్కూల్ వద్ద గల ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకులు, తదితర చోట్ల గాలి పంపులు ఏర్పాటు చేశారు. కానీ వాటి నిర్వహణ బాధ్యతలు గాలికొదిలేశారు. అత్యవసర సమయాల్లో మాత్రమే అక్కడ ఉన్న సిబ్బందితో పనిచేయిస్తున్నట్లు తెలిసింది.

మరుగుదొడ్లు ఉన్నా లేనట్లే

చాలా పెట్రోల్ బంకుల వద్ద మరుగుదొడ్లను నిర్మించారు. అయితే వాటి నిర్వహణ భారం భరించలేక మరుగుదొడ్లు పనిచేయడం లేదని వాహనదారులను బుకాయించి పంపుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్నిచోట్ల అత్యవసర సమయాల్లో మహిళలకు మాత్రమే అనుమతిస్తుండగా, మరికొన్ని చోట్ల ఆ పరిస్థితి కూడా లేదు.



నన్నూరులోని పెట్రోల్ బంకు

మంచి నీటిలోనూ మతలబే

సాధారణ ప్రయాణికులతో పాటు, సుదూర ప్రాంతాలకు చెందిన యాత్రికులు, పర్యాటకులు అత్యవసర సమయాల్లో తాగునీటి కోసం పెట్రోల్ బంకుల వద్దకు వెళుతుంటారు. అయితే కొన్నిచోట్ల శుద్ధజలానికి బదులుగా బోరునీళ్లను ఉంచుతున్నారు. మరికొన్ని చోట్ల కొళాయిలు అమర్చారు తప్ప నీరు రావడం లేదు. నిబంధనల ప్రకారం ప్రతి పెట్రోల్ బంకు వద్ద ఆర్‌ఓ ప్లాంట్ పెట్టాల్సి ఉన్నా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు.

పేరుకే ఫస్ట్ ఎయిడ్ బాక్స్

ప్రతి పెట్రోల్ బంకు వద్ద తప్పనిసరిగా ప్రథమ చికిత్స నిమిత్తం మందులు అందుబాటులో ఉంచాలి. కానీ నామమాత్రంగా ఫస్ట్‌ఎయిడ్ బాక్సుల్లో దూది, కత్తెర, డిస్టిల్ వాటర్ మినహా అవసరమైన మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచడంలేదు. అలాగే చమురు నాణ్యతను తెలుసుకునే పరీక్షా యంత్రాన్ని అంతర్గతంగా దాచిపెట్టారు. చమురు స్టాక్ వివరాలను నమోదు చేసే బోర్డులను బయటకాకుండా, లోపల అమర్చినట్లు తెలుస్తోంది. స్టాక్ అయిపోతే ఏ సమయంలో స్టాక్ వస్తుందనే వివరాలను అందులో కనబరచాలి. కానీ ఎక్కడా సంతృప్తిస్థాయిలో అమలు చేయడం లేదు. వీటిని పర్యవేక్షించాల్సిన తూనికలు, కొలతల శాఖ అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేస్తుండడంతో యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి.

మరుగుదొడ్లు కూడా లేవు



పెట్రోల్ బంకుల్లో మరుగుదొడ్లు ఉన్నా వెళ్లనీయడం లేదు. ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. డీజిల్ మెకానిక్‌లో డిప్లమా చదివిన వారుగానీ, పెట్రోల్, డీజిల్‌పై అనుభవం ఉన్న వారిని విధుల్లోకి తీసుకోవాలి. అనుభవం, చదవురాని వారిని బంకుల్లో పెట్టుకోవడంతో పొరపాట్లు చేస్తున్నారు. డీజిల్‌కు బదులుగా పెట్రోల్ వేసిన సందర్భాలు ఉన్నాయి.

–రమేష్, ఆటో డ్రైవర్, మీదివేముల

ఫిల్టర్ నీళ్లు అందుబాటులో ఉంచాలి



వాహనదారుల సౌలభ్యం కోసం పెట్రోల్ బంకుల వద్ద ఫిల్టర్ నీళ్లను అందుబాటులో ఉంచాలి. చాలాచోట్ల ఫిల్టర్‌కు బదులుగా బోరు నీళ్లు ఉంచుతున్నారు. కొన్నిచోట్ల కొళాయిలు ఉన్నా వాటిని సక్రమంగా శుభ్రం చేయడంలేదు. అపరిశుభ్రంగా ఉండడంతో తాగడానికి వెనకడుగు వేస్తున్నాం. వేసవిని దృష్టిలో ఉంచుకుని పెట్రోల్ బంకుల వద్ద తాగునీటి వసతిని మెరుగుపరచాలి.

–ఆంజనేయులు, ద్విచక్ర వానదారుడు, నన్నూరు

గాలిపంపులు పనిచేసేలా చూడాలి



పెట్రోల్ బంకుల వద్ద గాలి పంపులు సక్రమంగా పనిచేసేలా చూడాలి. చాలా చోట్ల గాలి పంపులు ఉన్నప్పటికీ సిబ్బందిని నియమించడంలేదు. రాత్రి సమయాలు, అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారులు పెట్రోల్ బంకుల వద్ద అన్ని సదుపాయాలు కల్పించేలా చూడాలి.

–టి.మధు, ఆటోడ్రైవర్, ఉయ్యాలవాడ

ఉద్యాన పంటలను ప్రోత్సహించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మల్లీశ్వరి

ఓర్వకల్లు: జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యానవన పంటలను ప్రోత్సహించాలని ప్రాజెక్టు ఆఫీసర్(ఎంపీడీఓ) మల్లీశ్వరి అన్నారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కేవలం కూలీలకు పనులు కల్పించడమే కాకుండా ఉద్యాన పంటలైన పండ్లు, పూలు సాగు చేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో మండలానికి 500 ఎకరాల్లో ఉద్యాన పంటలను సాగుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అందుకు ప్రతి ఒక్కరు క్షేత్ర స్థాయిలో తిరిగి రైతుల అభిప్రాయాలు సేకరించాలని పేర్కొన్నారు. ఉపాధి పథకం ద్వారా చేపట్టిన పర్కులేషన్ ట్యాంకులు, నీటి కుంటల వద్ద వర్కుసైట్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. కూలీలకు గరిష్ట వేతనం అందేలా పనులను గుర్తించాలని తెలిపారు. సమావేశంలో ఏపీఓ కుమార్‌సాయినాథ్, ఈసీ మధువెంకటకృష్ణ, సీఎల్ఆర్‌సీ కోర్సు డైరెక్టర్ నాగ ఎర్రమల పాల్గొన్నారు.

సచివాలయ సేవలను విస్తృతం చేయండి

ఓర్వకల్లు: సచివాలయ సేవలను ప్రజలకు విస్తృతం చేయాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం సాధారణ తనిఖీలో భాగంగా మండలంలోని శకునాల, బ్రాహ్మణపల్లె గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలను తనిఖీ చేశారు. ఆయా కార్యాలయాల్లో ప్రజలకు అందజేస్తున్న సేవలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడి నుంచి తిప్పాయపల్లెలో రైతులు సాగు చేసిన జామ తోటలను పరిశీలించి తోటల నిర్వహణలో పాటించాల్సిన మెలకువలను వివరించారు. ఆయన వెంట ఏపీఓ కుమార్‌సాయినాథ్, ఈసీ మధువెంకటకృష్ణ, హౌసింగ్ ఏఈ రామయ్య ఉన్నారు.



నూతన పాలకవర్గంతో కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్

పార్టీలో కష్టపడేవారికి తగిన గుర్తింపు

- కుడా ఛైర్మన్ కోట్ల, వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఇన్‌చార్జ్ సతీష్
- ఎల్లమ్మ ఆలయ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

కర్నూలు సిటీ: నగర శివారులోని వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయ పాలకవర్గం కమిటీ ఛైర్మన్‌గా ఎ.మహేశ్వరరెడ్డి, సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథులుగా కూడా ఛైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ హాజరై నూతన పాలకవర్గాన్ని అభినందించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కోడుమూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించేందుకు అందరిని కలుపుకుని సమన్వయంతో పని చేస్తామని, ఇందుకు ప్రతి కార్యకర్త సిద్ధం కావాలని అన్నారు. ప్రతిపక్ష పార్టీలు చేసే విమర్శలను కార్యకర్తలు తిప్పికొట్టాలని, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రతి ఒక్కరికీ వివరించాలన్నారు. కార్యకర్తలందరిని కలుపుకుని పనులు చేస్తామన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. పేదవాడికి విద్య, వైద్యం, సంక్షేమం అందాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. తాను స్థానికుడినేనని, కర్నూలులో చదువుకుని ఇక్కడే నివాసం ఉంటున్నానని, పసుపుల పరిధిలో తనకు వ్యవసాయ భూములు ఉన్నాయని, దిన్నెదేవరపాడు గ్రామం సమీపంలో వ్యవసాయ భూములు ఉన్నాయని కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ అన్నారు. తాను కర్నూలు నగరంలోనే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే పాఠశాల విద్య, కాలేజీ విద్యను పూర్తి చేసి, కర్నూలు మెడికల్ కాలేజీలోనే మెడిసిన్ పూర్తి చేశానని, ఇక్కడే విద్యా సంస్థలు ఏర్పాటు చేసినట్లు ఆయన కార్యకర్తలతో పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో కోడుమూరు, గూడురు, సి.బెళగల్ జెడ్పీటీసీ సభ్యులు రఘునాథరెడ్డి, మౌలాలి, ప్రసన్నకుమార్, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, గోశాల ఛైర్మన్ ఆదిమోహన్ రెడ్డి, కార్పొరేటర్ విక్రమ సింహారెడ్డి, పసుపుల సొసైటీ ఛైర్మన్ శేషిరెడ్డి, గార్గేయపురం సింగిల్ విండో ఛైర్మన్ వినయ్‌కుమార్ రెడ్డి, మాజీ ఛైర్మన్ బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, ఉల్చాల సొసైటీ ఛైర్మన్ వంశీకృష్ణారెడ్డి, రామోహన్ రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయండి



అసెంబ్లీలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: నియోజకవర్గ సమస్యలపై పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి బుధవారం అసెంబ్లీలో ప్రస్తావించారు. సీమకే జీవనాడి అయిన గోరుకల్లు జలాశయాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరారు. అలగనూరు రిజర్వాయర్ కట్ట కుంగిపోవడంతో మరమ్మతులకు నోచుకోవడం లేదని, ప్రాజెక్టుపై దృష్టి సారించి త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వెలగమాన్ డ్యామ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ డ్యామ్‌కు సంబంధించి జిందాల్ సిమెంట్ పరిశ్రమ ప్రతినిధులు అలైన్‌మెంట్ మార్చారని, ఇందుకు ఆ కంపెనీ రూ. 5కోట్లు ఇస్తామన్నారన్నారు. ఈ పనులకు టెండర్లు పూర్తి చేసి పనులు చేపట్టాలని కోరారు. అలాగే కల్లూరు మండలం ఉలిందకొండలో ఇంటర్ కళాశాలను ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. ఉన్నత విద్య కోసం విద్యార్థులు 25 కి.మీ వెళ్లాల్సి వస్తోందన్నారు. కర్నూలులో ఉన్న పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి 16 వార్డుల్లో రోజు నీరు అందించేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అలాగే గడివేముల మండలం బుజునూరు గ్రామం వద్ద ఉన్న గాలేరు–నగరి సుజల స్రవంతి కాల్వపై బ్రిడ్జి నిర్మించేందుకు చొరవ తీసుకోవాలన్నారు.

ప్రశాంత జీవనం సాగించాలి

- అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు
- సీఐ మన్సురుద్దీన్



కోడుమూరులో సోదాలు నిర్వహిస్తున్న సీఐ మన్సురుద్దీన్, ఎస్ఐలు

కోడుమూరు రూరల్ : ప్రతిఒక్కరూ ప్రశాంతంగా జీవనం సాగించాలని సీఐ మన్సురుద్దీన్ సూచించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఏ మాత్రం అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బుధవారం ఉదయం కోడుమూరులో సీఐ ఆధ్వర్యంలో కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ ఎస్ఐలు బాలనరసింహులు, పీరయ్య, తిమ్మారెడ్డి సిబ్బంది నాకాబందీ నిర్వహించారు. రౌడీషీటర్లు, అనుమానితుల ఇళ్లను తనిఖీ చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. అనవసరమైన గొడవలకు జోలికి వెళ్లినా, దాడులకు పాల్పడినా జైలుకు పంపుతామని హెచ్చరించారు. కేసులు నమోదు, జైలు జీవితం మూలంగా సమాజంలో సరైన గుర్తింపు ఉండదని, కుటుంబాలు సైతం చిన్నాభిన్నమవుతాయన్నారు. గొడవలకు దూరంగా ఉండి పిల్లలను చక్కగా చదివించుకుంటూ కుటుంబాలను పోషించుకోవాలని సూచించారు. ఏవైనా సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని, వీలుకానప్పుడు పోలీసులను ఆశ్రయిస్తే న్యాయం చేస్తామని చెప్పారు. ఎవ్వరైనా అనుమానిత వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు ఇవ్వాలని సీఐ కోరారు. కార్యక్రమంలో సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

9న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం



ఎంపీడీఓకు అల్బెండజోల్ మందులు అందజేస్తున్న డీఓంఅండ్‌హెచ్ఓ రామగిడ్డయ్య



నులిపురుగుల నివారణ పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు



సి.బెళగల్లో అల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్న అధికారులు

గూడూరు: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని ఈ నెల 9న పకడ్బందీగా నిర్వహించాలని డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రామసుబ్బారెడ్డి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జయశ్రీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఎంఅండ్‌హెచ్ఓ మాట్లాడారు. అంగన్‌వాడీ, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు 9వ తేదీన 400 మిల్లీ గ్రాముల ఆల్బెండజోల్ మాత్రలు మధ్యాహ్నం భోజనం అనంతరం మింగించాలన్నారు. పిల్లలలో రక్త హీనత జబ్బు నివారణకు ఈ మాత్రలు బాగా పని చేస్తాయన్నారు. అనంతరం విద్యార్థులకు వేయాల్సిన ఆల్బెండజోల్ మాత్రలను ఆయన ఎంపీడీఓకు అందజేశారు. అనంతర అధికారులు పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ప్రత్యూష్నా, ఎంఈఓ సునీలమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్ : రక్తహీనతకు ప్రధాన కారణమైన నులిపురుగుల నివారణ కోసం ఈనెల 9వతేదీన 1నుంచి 19సంవత్సరాల్లోపు పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు వేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పీసీపీఎన్‌డీటీ సెల్ లీగల్ కన్సల్‌టెంట్ సుమలత సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ దివ్య, ఎంఈఓలు వసంతలక్ష్మి, శరభయ్య, వైద్యాధికారులు డా.భాస్కరరావు, డా.మదన్‌శేఖర్‌లతో కలిసి ఆమె కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో వైద్యులు డా.భాస్కర్, డా.మదన్‌శేఖర్, సీహెచ్ఓ శాంత, ఎంపీహెచ్ఈఓ నరసప్ప, సూపర్‌వైజర్లు శారద, ఉమాభాయి, ఐసీడీఎస్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సి.బెళగల్: నులిపురుగల నివారణ మందుల పంపిణీని పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ శకుంతల అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డాక్టర్ సునీత, ఎంఈఓ జ్యోతితో కలిసి ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ వర్కర్లకు కార్యక్రమ నిర్వహణపై అవగాహన కల్పించారు. పిల్లలకు ఆల్బెండజోల్ మందులు వేసేప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎంపీడీఓ వివరించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులకు ఆల్బెండజోల్ మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మంగమ్మ, హెచ్ఎంలు కిషోర్‌కుమార్, సరోజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం



మందులు అందజేస్తున్న రామగిడ్డయ్య

గూడూరు: ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని, జగనన్న సురక్ష ఆరోగ్య వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎం అండ్‌హెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య సూచించారు. గూడూరు పట్టణంలోని నాల్గవ సచివాలయ పరిధిలో బుధవారం మున్సిపల్ కమిషనర్ దివాకరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష ఆరోగ్య శిబిరాన్ని డీఎంఅండ్‌హెచ్ఓ పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. డాక్టర్లు 419 మందికి వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు డీఎంఅండ్‌హెచ్ఓ చేతుల మీదుగా మందులు అందజేశారు. కొందరిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశామని డాక్టర్లు తెలిపారు. శిబిరంలో పీహెచ్‌సీ డాక్టర్ ప్రత్యూష్న, డాక్టర్ కేదార్‌నాథ్, డాక్టర్ అయేష, ఆప్తాలమిస్ట్ సంపత్‌కుమార్, హెల్త్ ఎడుకేటర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగులను నులిమేద్దాం



నులిపురుగుల నివారణ పోసర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ రమణమూర్తి



గడివేములలో పోస్టర్లను విడుదల చేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీడీఓ

కల్లూరు: ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నులిమేద్దామని ఎంపీడీఓ రమణమూర్తి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నులిపురుగుల నివారణ మాత్రల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం ఈ నెల 9న ప్రారంభమవుతుందన్నారు. అదే రోజు పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణకు మాత్రలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పిల్లలు, కిషోర బాలల కడుపులో నులిపురుగులు ఉన్నట్లయితే శారీరక, మానసిక ఎదుగుదల లోపాలను కలిగి ఉంటారన్నారు. కార్యక్రమంలో కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్, సీహెచ్ఓ సురేష్ పాల్గొన్నారు.

డీ వార్మింగ్ డేను విజయవంతం చేద్దాం

గడివేముల: జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీడీఓ శివరామిరెడ్డి కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 1–5 ఏళ్ల పిల్లలకు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీపాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 6–19 వయస్సు గల విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ కమిటీ ఛైర్మన్ పుల్లయ్య, వైద్య సిబ్బంది హుషేన్‌రెడ్డి, ఉత్తయ్య పాల్గొన్నారు.

గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచండి



సి.బెళగల్లో పోలీసులతో మాట్లాడుతున్న ఎస్ఐ తిమ్మారెడ్డి

సి.బెళగల్: గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్ఐ తిమ్మారెడ్డి సిబ్బందికి సూచించారు. ఏఎస్ఐ నాగయ్య, పోలీస్ సిబ్బందితో శాంతి భద్రలపై బుధవారం నిర్వహించిన సమీక్షలో ఎస్ఐ మాట్లాడారు. కేటాయించిన గ్రామాల్లో కానిస్టేబుళ్లు ప్రతిరోజు పర్యటించాలని, పాత నేరస్తులు, రౌడీషీటర్ల కదలికపై సమాచారం ఎప్పటికప్పుడు తెలుపాలని సూచించారు. అదేవిధంగా ఇసుక, మద్యం అక్రమ రవాణాలపై, జూదం, మట్కా, గుట్కా తదితర అసాంఘిక కార్యాకలాపాలపై తన సెల్ నంబర్ 9121101073కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. సమాచారం చేరవేసిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని, అన్నిరకాలుగా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. హెడ్‌కానిస్టేబుల్ కృష్ణ, కానిస్టేబుళ్లు సుదర్శణం, దస్తగిరి, సుజాత తదితరులు ఉన్నారు.